## ఎల్లారెడ్డి ఎస్సైగా మహేశ్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 28: ఎల్లారెడ్డి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చిందం గణేశ్ ఆదివారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బొజ్జ మహేశ్ రానున్నారు. మహేశ్‌ను ఎల్లారెడ్డికి బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, జనవరి 28 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్నది, కొందరు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డుల అప్‌డేట్ పేరిట, బహుమతులు వచ్చాయని మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలలు, లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవాలని నమ్మించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు ఖాళీ చేస్తారని తెలిపారు. అపరిచితుల ఫోన్ కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## పాదయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

నస్రుల్లాబాద్, జనవరి 28: బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామంలోని విఠలేశ్వర రుక్మిణీ ఆలయం నుంచి భక్తులు ఫిబ్రవరి 5వ తేదీన పాదయాత్రగా పండరీపూర్‌కు బయల్దేరనున్నారు. పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను బీర్కూర్ కోదండ రామాలయం వద్ద పీరాజీ మహరాజ్ ఆదివారం విడుదల చేశారు. 15 రోజుల పాటు పాదయాత్ర చేసి ఫిబ్రవరి 21న భక్తులు పండరీపూర్ చేరుకుంటారని మహరాజ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నారాయణ, గణేశ్, రాజేశ్వర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 28: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పొలాలకు రైతులు నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ విస్తీర్ణాధికారి రాజాగౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వరి పిలక దశలో ఉన్నదని, వాతావరణం మబ్బులు పట్టి, పొగమంచు ఉండడంతో అగ్గితెగులు సోకే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ ఒక ఎకరానికి 125 గ్రాములను 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరిని ఆశిస్తున్న కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరోపైరిఫాస్ 50ఈసీని ఎకరానికి 250ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే 9492208960 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## మత్స్యకార్మికులకు నేటి నుంచి అవగాహన

నిజాంసాగర్, జనవరి 28: నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట గ్రామ రైతు వేదికలో సోమ, మంగళవారాల్లో మత్స్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపలు వేటాడే సమయంలో ప్రమాదాలు జరుగకుండా, తెప్పపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. రోజుకు 75 మంది చొప్పున రెండు రోజులపాటు 150 మందికి అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు నిర్వహించే ఈ అవగాహన కార్యక్రమానికి మత్స్య కార్మికులు తరలిరావాలని కోరారు.



కార్యకర్త రమేశ్ కుటుంబానికి రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని రత్నగిరిపల్లి సర్పంచ్‌కు అందజేస్తున్న గంప గోవర్ధన్

# బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

- ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్

మాచారెడ్డి, జనవరి 28 : కష్టాల్లో ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీతోపాటు తాముకూడా అండగా ఉంటామని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ భరోసా ఇచ్చారు. మండలంలోని రత్నగిరిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పిట్ల రమేశ్ ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రెండు రోజుల క్రితం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కటిక పేదరికంలో ఉన్న రమేశ్ కుటుంబానికి రూ. 50వేల ఆర్థికసాయం ప్రకటించారు. రాజంపేట్ శివారులో ఓ దివ్యాంగుడికి సొంత ఖర్చుతో ఇల్లు నిర్మించగా, ప్రారంభోత్సహానికి హాజరైన గోవర్ధన్.. రమేశ్ కుటుంబానికి 50 వేల రూపాయలను రత్నగిరిపల్లి సర్పంచ్ శ్రీశైలానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, నాగిరెడ్డి, పిప్పిరి ఆంజనేయులు, గోపీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే షిండే

బిచ్కుంద, జనవరి 28: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, బిచ్కుంద మాజీ సర్పంచ్ స్వర్గీయ సిద్ధిరాం భార్య జయలక్ష్మి శనివారం రాత్రి మృతిచెందింది. ఆమె అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ఆమె అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో ఎంపీపీ అశోక్ పటేల్, వైస్ ఎంపీపీ రాజు పటేల్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నాగ్‌నాథ్‌పటేల్, సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, బీఆర్‌ఎస్ బిచ్కుంద, మద్నూర్ మండలాల అధ్యక్షులు వెంకట్‌రావు దేశాయి, బన్సీ పటేల్, నాయకుడు సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాడె మోస్తున్న హన్మంత్ షిండే

## సావర్‌గావ్‌లో వైద్య శిబిరం

నిజాంసాగర్, జనవరి28: జుక్కల్ మండలంలోని సావర్‌గావ్ గ్రామంలో ఆదివారం సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురికి క్యాన్సర్, షుగర్, థైరాయిడ్, కొలెస్ట్రాల్‌తో పాటు రక్తం, మూత్ర తదితర మొత్తం 50 రకాల పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులతో పాటు సర్పంచ్ పవార్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



పోచారం శ్రీనివాసరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న బాన్సువాడ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

## ఎమ్మెల్యే పోచారాన్ని కలిసిన ప్రజాప్రతినిధులు

బాన్సువాడ టౌన్, జనవరి 28: మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లో ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మున్సిపల్ తరఫున మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నదానం

బాన్సువాడ టౌన్, జనవరి 28: అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం మహా అన్నదానం ఏర్పాటుచేశారు. అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ధర్మ భిక్షాటన

పిట్లం, జనవరి 28: మండలకేంద్రంలో జుక్కల్ గోవింద్ మహరాజ్ మఠాధిపతి గోపాల్ మహరాజ్ తనయుడు కేశవ్ మహరాజ్ ఆదివారం ధర్మ భిక్షాటన నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కేశవ్ మహరాజ్‌కు భక్తులు ఘన స్వాగతం పలికారు. అతడికి పాదపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, విండో చైర్మన్ శపథంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు మంచి శశిధర్, శిష్య బృందం రాము, హన్మాండ్లుచారి, లక్ష్మణ్ రావు, పద్మ ఆంజనేయులు, శంకర్‌గౌడ్, చుండూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహరాజ్‌కు పాదపూజ చేస్తున్న భక్తులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కామారెడ్డిలోని వివేకానంద పాఠశాల పూర్వ విద్యార్థులు



ఉత్తునూరు జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

## అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

*కామారెడ్డి పట్టణంలోని వివేకానంద పాఠశాలకు చెందిన 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసుకున్నారు. 25 ఏండ్ల తర్వాత అందరూ.. తాము చదువుకున్న పాఠశాల ఆవరణలోనే ఒక్కచోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.*

*సదాశివనగర్ మండలం ఉత్తునూర్ జడ్పీహెచ్‌ఎస్ 2007-2008 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులందరూ ఒక చోటికి చేరి అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఆర్థికంగా సహకరించాలని నిర్ణయించుకున్నారు.*

*-కామారెడ్డి/సదాశివనగర్, జనవరి 28*

# అడవి పందులతో పంటలకు నష్టం

- రక్షించుకునేందుకు రైతుల పాట్లు
- రాత్రుల్లో గస్తీ కాస్తున్న అన్నదాతలు
- రక్షణగా పంట చుట్టూ చీరెలు



డోంగ్లీలో సాగుచేస్తున్న జొన్న

డోంగ్లీ, జనవరి 28: యాసంగిలో కష్టపడి సాగుచేసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ఆశ జనకంగా ఉన్న పంటలకు అడవి పందులు నష్టం కల్గిస్తున్నాయి. వాటి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళల్లో అడవి పందులు పంటలపై దాడి చేస్తున్నాయి. పంటను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. మండలంలోని డోంగ్లీ, మారేపల్లి మల్లాపూర్, లింబూర్, టాక్లీ, వాడి, మొఘ తదితర గ్రామాల్లో యాసంగి సీజన్‌లో జొన్న, శనగ, కంది పంటలను సాగుచేశారు. ప్రస్తుతం పంట కాత దశలో ఉండగా.. పందులు దాడిచేసి నష్టం కల్గిస్తున్నాయి.

**రాత్రి వేళల్లో గస్తీ..**

పంటలను రక్షించుకునేందుకు రైతులు శ్రమిస్తున్నారు. పంట చుట్టూ చీరెలతో కంచెను ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా చేలల్లోనే ఉంటున్నారు. రాత్రి వేళల్లో పందుల బెడద ఎక్కువగా ఉండడంతో .. పొలాల వద్ద రైతులు విడుతల వారీగా గస్తీ కాస్తున్నారు.



పంట చుట్టూ చీరలు కట్టడానికి మేకు పాతుతున్న రైతు

### రాత్రి పొలం వద్దే ఉంటున్న..



నేను నాలుగు ఎకరాల్లో శనగ, జొన్న పంటలను సాగుచేస్తున్న. ప్రస్తుతం పంట చేతికి అందే దశలో ఉన్నది. అడవి పందులు విపరీతంగా దాడి చేస్తున్నాయి. దీంతో రాత్రి వేళ పొలం వద్దే ఉంటున్న. పందులు రాకుండా కాపలా కాస్తున్న.

**- ఆర్.సుభాష్, రైతు, డోంగ్లీ**



కాంప్లెక్స్ షట్టర్లను స్వాధీనం చేసుకుంటున్న ఆలయ ఈవో

## ఆలయ కాంప్లెక్స్ షట్టర్లు స్వాధీనం

మాచారెడ్డి, జనవరి 28 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లోని వీరహన్‌మాన్ ఆలయ కాంప్లెక్స్ షట్టర్లను ఈవో ప్రభు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఇన్ని రోజులూ షట్టర్లు ఈ కాంప్లెక్స్ నిర్మించిన వారి ఆధీనంలోనే ఉన్నాయి. ఈ నెల 11న దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ సమక్షంలో 8 షట్టర్లను స్వాధీనం చేసుకున్నారు. మిగతా షట్టర్లలో వ్యాపారాలు నిర్వహిస్తుండగా, వాటిని ఖాళీ చేసేందుకు ఈ నెల 28వ తేదీవరకు గడువు ఇచ్చారు. ఆదివారంతో గడువు ముగియడంతో మిగిలిన షటర్లనును కూడా స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సురేందర్, లక్ష్మణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

పిట్లం, జనవరి 28: మండలకేంద్రంలోని రాజరాజేశ్వరి గార్డెన్‌లో నేడు (సోమవారం) ఉదయం 10 గంటలకు జుక్కల్ నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, విండో చైర్మన్లు, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

మాచారెడ్డి, జనవరి 28 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లోని వీరహన్‌మాన్ ఆలయ ఆవరణలో ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా శంకర్, ఉపాధ్యక్షుడిగా పొదర్ల రామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా నునావత్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లారపు రమేశ్, కోశాధికారిగా కేలోత్ స్వామిని నియమించారు. కార్యక్రమంలో సదర్‌నాయక్, మాన్‌సింగ్, రవి, తిరుపతి, మహేశ్, శ్రీను, రంజాన్, గంగ నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం ఎంపిక




స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

బాన్సువాడ రూరల్, జనవరి 28 : మండలంలోని బోర్లం గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం స్థలాన్ని ఎంపిక చేశారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు ముందుకు రావడంతో గంగపుత్ర సంఘం పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని ఎంపిక చేశామని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ మంద శ్రీనివాస్, శివరాజులు, రాజేశ్వర్ గౌడ్, సతీశ్‌గౌడ్, సాయిబాబా, రవి, తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 28: ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ గురుకుల కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మసూద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. tmreis telangana cgg.gov.in ద్వారా ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మొత్తం 40 సీట్ల చొప్పున ఉండగా.. 30 సీట్లు మైనారిటీలకు, 10 సీట్లు ఇతరులకు (ఎస్సీ-2, బీసీ-5, ఎస్టీ-2, ఓసీ-1) కేటాయించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు గడువు ఫిబ్రవరి 6వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఎల్లారెడ్డి మైనారిటీ గురుకుల కళాశాలలో మాత్రమే ఎంఈసీ గ్రూప్ ఉన్నదని తెలిపారు. మరిన్ని వివరాలకు 8328123773, 9908803968 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## మల్కాపూర్ పంచాయతీ భవనం ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మాధవి

ఎల్లారెడ్డి, జనవరి 28: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎంపీపీ కర్రె మాధవి ఆదివారం ప్రారంభించారు. రూ.20 లక్షల వ్యయంతో జీపీ భవనాన్ని నిర్మించినట్లు అధికారులు తెలిపారు. గతంలో జంగమాయిపల్లి గ్రామ పంచాయతీలో ఆమ్లెట్ విలేజ్‌గా ఉన్న మల్కాపూర్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్తగా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి జీపీ భవనాన్ని మంజూరు చేసింది. దీంతో కొత్త భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉషాగౌడ్, వైస్ ఎంపీపీ పెద్దెడ్ల నర్సింహులు, సర్పంచ్ కాసాల హేమలత, నాయకుడు బాలరాజ్‌గౌడ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'జైపాల్‌రెడ్డికి బీజేపీ ఎంపీ టికెట్ ఇవ్వొద్దు'

గాంధారి, జనవరి 28: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎం.జైపాల్ రెడ్డికి బీజేపీ జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వొద్దని ఆ పార్టీ గాంధారి మండల నాయకులు అన్నారు. గాంధారిలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడారు. జైపాల్‌రెడ్డి బీజేపీ సిద్ధాంతాలను పాటించడం లేదని, పార్టీ కార్యకర్తలను విస్మరిస్తున్నారన్నారు. ఇతర పార్టీల వారిని ప్రోత్సహిస్తూ.. గొడవలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆయనపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి టికెట్ ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు జువ్వాడి శ్రీకాంత్, మాణిక్‌రావు, ప్రభాకర్‌రావు, గంగి రమేశ్, సతీశ్, వాసు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-AII

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.